# ధనసంపాదన కన్న గుణసంపాదన మిన్న

ప్రేమస్వరూపులారా!

వైస్ ఛాన్స్‌లర్, మాజీ వైస్ ఛాన్స్‌లర్, సెంట్రల్ ట్రస్టు సెక్రెటరీ, ఇద్దరు విద్యార్థులు ఎంతో సుందరమైన విషయాలను అందమైన పదములతో అందించారు. ఈ ప్రపంచము నందు ఎందుచూసినా ఆశ్చర్యకరమైన దృశ్యములు, ఆనందకరమైన విషయములు హృదయాన్ని తట్టిలేపి ఆనందపరుస్తున్నవి. మన విద్యార్థులుకూడా తమ తెలివితేటలను ప్రకాశింపజేసుకుంటూ, ఆటపాటలచేత, ఆనందకరమైన ప్రదర్శనలచేత హృదయమునకు ఉల్లాసము కల్గిస్తూ వచ్చారు. విద్యార్థులు ఏ చర్యలు చేపట్టినా హృదయాన్ని మెప్పించే నిమిత్తం చేస్తారేగాని, తాత్కాలికమైన ఆనందము నిమిత్తం కాదు. ఇట్టి సమయమునందు నేను విద్యార్థులకు ఆటపాటల విషయమై అమితంగా బోధించనక్కర్లేదు. ప్రేమచేత హృదయాన్ని పెంపొందింపజేసుకొని ప్రజలకు ఆనందమును, ఆదర్శమును విద్యార్థులు అందించాలి. మానవుడు పుట్టినప్పటినుండి తలచే తలంపులు, చేసే పనులన్నీ విద్యావిషయానికి సంబంధించినవే! ఈనాడు ఎక్కడ చూసినా విద్యావిషయమై చర్చించుకుంటున్నారుగాని, నిజమైన విద్య ఎక్కడా కనిపించడం లేదు. పుస్తకములు చదివి, అందులోని విషయములను పరీక్షలలో వ్రాసి పాస్ మార్కులు తెచ్చుకొని విద్యావంతులని బిరుదు పొందుతున్నారు. కాని విద్య అంటే ఏమిటో, నిత్యసత్యమైన విద్య ఏదో ఎవరికీ తెలియటం లేదు.

*చదువులన్నియు చదివి చాల వివేకియై*
*మదిని తన్నెరుగడు మందమతుడు*
*ఎంత చదువు చదివి ఏరీతి నున్నను*
*హీనుడవ గుణంబు మానలేడు*

దీనిని విద్య అని చెప్పడానికి వీలుకాదు. విద్య అనగా జ్ఞానమని అర్థం. జ్ఞానమనగా భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన తెలివితేటలను పెంచుకోవటం కాదు. అంతర్భావము నందు ఆనందాన్ని పెంపొందింపజేసి, ప్రకాశింపజేయునదే నిజమైన విద్య.

sri sathyasai vachanamrutam

నేటి విద్యార్థులు అభ్యసిస్తున్న విద్య ఎలాంటిది? దీనివలన వారికి లభిస్తున్న ఫలమేమిటి? ప్రభుత్వము ఇచ్చే డిగ్రీలను పొందుతున్నారేగాని, విద్యయొక్క సత్యస్వరూపము ఏమిటనేది వారికే తెలియడం లేదు. ఇంక, ఇతరులకు ఏమి బోధించగలరు? ఆట పాటలయందు అనుభవించవలసిన ఆనందమేమిటో నేటి విద్యార్థులకు అర్థం కావటం లేదు. క్రీడలలో గెలుపే ప్రధానమని భావిస్తున్నారు. కాని, ఇదియా క్రీడలయొక్క లక్ష్యము? కాదు కాదు. "జీవితము ఒక క్రీడ, పాల్గొనండి. జీవితము ఒక కల, తెలుసుకోండి. జీవితము ప్రేమమయం, అనుభవించి ఆనందించండి" ఈ మూడింటియొక్క అంతరార్థమును గుర్తించి వర్తించే వాడే నిజమైన విద్యార్థి.

సమాజాభివృద్ధికి ఉపకరించని విద్య నిరర్థకం

ఈనాటి విద్యావిధానం సంకుచితమైన భావాలను పెంపొందిస్తున్నదేగాని, విశాలమైన హృదయమునకు అనంతమైన విజ్ఞానమునకు ఏమాత్రం తోడ్పడడం లేదు. ఈనాటి విద్యలన్నీ కేవలం జీవనోపాధికి ఉపయోగపడేవిగా ఉంటున్నవి. పాఠ్యపుస్తకాలలో ఏమాత్రము సారము లేదు. గవర్నమెంటువారు వీటిని ఏవిధముగా ఒప్పుకుంటున్నారో తలుచుకుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటున్నది. బహుశా ఈ విషయము గవర్నమెంటు వరకు కూడా పోవటం లేదు. క్రింది స్థాయిలో ఎవరో ఒకరు వాటిని పాఠ్యపుస్తకాలుగా నిర్ణయిస్తున్నారు. ఇది గవర్నమెంటుకు ఎంత చెడ్డపేరుతెస్తున్నదో వారు గుర్తించటం లేదు. ప్రపంచములో ఆధునిక చదువులు పెరిగిపోతున్నాయి. ప్రాచీనవిద్యలు ఎంత పవిత్రమైనవో, ఎంత సున్నితమైనవో గుర్తించటానికి ఎవ్వరూ ప్రయత్నించడం లేదు. విద్యార్థులు ఏవో గ్రంథములను చదివి, డిగ్రీలు తీసుకొని ఉద్యోగాలకొరకై ప్రాకులాడు తున్నారేగాని, చదువుయొక్క సారమును ఏమాత్రం గ్రహించటం లేదు. ఈ గ్రంథములందు సరియైన విద్య ఉన్నదా, లేదా అని తల్లిదండ్రులుకూడా యోచించటం లేదు. పిల్లవానికి మార్కులు దండిగా వచ్చాయని ఆనందిస్తున్నారేగాని, ఆ మార్కుల వెనుక ఉన్న కొండంత చెడు రిమార్కులను వారు పట్టించుకోవటం లేదు. ఆ రిమార్కులపైననే గనుక దృష్టి పెడితే ఈ చదువుయొక్క ఫలితమేమిటో వారు గుర్తించగలరు.

"ఏబీసీడీలు ఎక్కువైనందున
వేదశాస్త్రములన్ని పేదబడియె"

sri sathyasai vahamrutam

ఇట్టి చదువులు సుజ్ఞానమును ఏరీతిగా అందించగలవు? ఈనాటి విద్యలో గొప్ప మార్పుతేవాలి.

విద్యార్థులారా! మీరు చక్కని విద్యను అభ్యసించి ప్రపంచమునకు ఆదర్శమును అందించడానికి పూనుకోవాలి. దేశముయొక్క కీర్తిని మీరు నిలబెట్టాలి. మన ప్రాచీన ఋషులు అందించిన విద్యను అభ్యసించాలి. నాల్గు డిగ్రీలు తీసుకున్నంతమాత్రమున గొప్పవారమని విఱ్ఱవీగడం వెఱ్ఱితనము. ఈనాడు సమాజముయొక్క పరిస్థితి ఏమిటి? మనం సమాజమును పోషంచే విధానమేమిటి? సమాజమును ఉత్తమోత్తమముగా తీర్చిదిద్దటానికి యేమి చేయాలి? అనే యోచన విద్యార్థులందు యేమాత్రము కనిపించటం లేదు. సమాజముయొక్క స్థితిగతులను గుర్తించుకొనకుండా సమాజానికి సేవచేస్తున్నామని అంటున్నారు కొందరు. అది సమాజసేవ కాదు, సమాధిసేవ! సమాజము ఉన్నతస్థితికి రావాలంటే, ప్రజలు ఉత్తమస్థితిని పొందాలంటే సరియైన విద్యను మనం అభివృద్ధిపరచాలి. ఏది మంచిది, ఏది చెడ్డది అనే విచారణ విద్యార్థులలో పెంపొందించాలి.

తల్లిదండ్రులు తమ పిల్లవానికి కాలేజీలో సీటు చిక్కితే ఆనందిస్తున్నారుగాని, ఆ చదువువలన పిల్లవాడు దేశానికి ఏవిధముగా ఉపకారము చేయగలడు? వానిలో సద్గుణములు అభివృద్ధి అవుతున్నాయా? అనే విచారణ చేయడం లేదు. వారికి అంతటి విశాలమైన భావములు లేవు. అధ్యాపకులు పాఠ్యగ్రంథములలో ఉన్న విషయాలను బోధిస్తున్నారేగాని, ఆ గ్రంథములు సరియైనవా కావా అనే విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయటం లేదు. ఒకవేళ ఎవరైనా రిపోర్టు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదు. ఏదో పాసైనారని విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వటం, పంపటం... అంతటితో తమ బాధ్యత పూర్తయినట్లుగా భావిస్తున్నారు. కనుక, ఈనాటి దుస్థితికి కారణం కేవలం విద్యార్థులు మాత్రమే కాదు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రభుత్వమువారికి కూడా ఇందులో భాగమున్నది.

### పిల్లల ప్రవర్తనను చక్కదిద్దడం ప్రథమ కర్తవ్యం

పిల్లలు తల్లిదండ్రులకు సత్కీర్తి తెప్పించాలి. సమాజాభివృద్ధికి పాటుపడాలి. క్లాసులో గొప్పవారని పేరు తెచ్చుకున్నంతమాత్రమున చాలదు. పిల్లలు ఎట్టి గుణములను అలవర్చుకుంటున్నారు? సమాజక్షేమాన్ని కోరుతున్నారా లేదా అనే విషయాలను తల్లిదండ్రులు యోచన చేయాలి. పిల్లలు తమ ఎదుట ఏవిధంగా ప్రవర్తిస్తున్నారు? బజారులో ఎలా

srisathyasaivahini.org

మెలగుతున్నారు? అనే విషయాలను గుర్తించడానికి ఏ తల్లిదండ్రులూ ప్రయత్నించటంలేదు. ఇంటివద్ద పిల్లలు ఎలాంటిపుస్తకాలు చదువుతున్నారనేది జాగ్రత్తగా గమనించాలి. పిల్లలు పిచ్చిపిచ్చి కథల పుస్తకాలు చదువుతున్నా కొందరు పట్టించుకోవటం లేదు. "వారికి ఇష్టంగా ఉంది కాబట్టి, చదువుకుంటున్నారు. అందులో తప్పేముంది?" అని పిల్లలను వెనకేసుకొస్తున్నారు. తమ పిల్లలను తామే పాడుచేస్తున్నారు. పిల్లల ప్రవర్తనను చక్కదిద్దకుండా గొప్ప చదువు చదివిస్తున్నామని గర్వించడం వెఱ్ఱితనం.

"మా పిల్లవాడు కాన్వెంటులో ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నాడు" అని గర్వంగా చెప్పుకుంటారు. ఏమిటా ఇంగ్లీషు? "బా.. బా.. బ్లాక్ షీప్" ఇదేనా పిల్లలకు నేర్పించవలసింది? ఇలాంటి చదువు చదవటంవలన పిల్లలు కూడా 'బ్లాక్‌షీప్' మాదిరిగా తయారౌతున్నారు. పుస్తకాలలో ఎలాంటి పద్యాలు వ్రాసినా పిల్లలచేత తమాషాగా చదివిస్తూ ఆనందిస్తున్నారేగాని, అలాంటి చదువు వలన పిల్లలకు కలిగే ప్రయోజనమేమిటని తల్లిదండ్రులు పరీక్షించటం లేదు. ఈవిధమైన చదువులను చూస్తుంటే, ఈ స్కూల్సు ఎందుకు కట్టాలి? పిల్లలను ఎందుకు చదివించాలి? వారిని ఎందుకు పాడుచేయాలి? అనే భావము నాలో తీవ్రముగా పెరుగుతున్నది.

శాంతి అనేది మంచినడతలోనే ఉంది

విద్యార్థులారా! మీరు గొప్ప చదువులు చదువుతున్నామని విఱ్ఱవీగకండి. ఈ చదువులతో పాటు మంచి గుణములను కూడా పోషించుకోండి. గుణములు లేకపోయినప్పుడు చదువులుండీ ప్రయోజనమేమిటి? గుణమును పోషించుకున్నప్పుడే చదువు సంస్కారాన్ని అందిస్తుంది. ఈనాడు విద్యార్థుల చేతిలో పిచ్చిపిచ్చి కథల పుస్తకాలు కనిపిస్తున్నాయి. అటువంటి పుస్తకాలు మార్కెట్టుకు రాకుండా పెద్దలు చూసుకోవాలి. విద్యార్థినీ విద్యార్థులలో సద్గుణములను పోషించే గ్రంథములు వెలువడాలి.

అనేక కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, పిల్లల దగ్గరనుండి నయాపైసా ఫీజు తీసుకోకుండా, వారికి కావలసిన గ్రంథాలను కూడా నేనే తెప్పించి చక్కని రీతిలో విద్యను బోధించాలని ప్రయత్నిస్తున్నాను. ఎంతమందో వస్తున్నారు. అందరూ ఫీజు కట్టుకోలేరు కదా! ఫీజు మాకు అవసరం లేదు. మీరు Peace (శాంతి) పొందండి. అదే నాకు కావలసింది. Peace ఎక్కడ చిక్కుతుంది? ఈనాడు ఎక్కడకు పోయినా Pieces తప్ప Peace చిక్కటం లేదు.

srisathyasai vachanamrutam

బయటి విషయాలన్నీ హృదయాన్ని Pieces (ముక్కలు)గా చేస్తున్నాయి. Peace అనేది ఎక్కడ ఉందంటే మంచి నడతలోనే ఉంది.

ఈనాడు ప్రైమరీ స్కూళ్ళలో సైతం వేలాది రూపాయలు డొనేషన్ చెల్లించి, సీట్లు ముందుగానే బుక్ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. తల్లిదండ్రులు అహర్నిశలు శ్రమిస్తూ, అప్పోసొప్పో చేసి పిల్లలను చదివిస్తున్నారు. కాని, ఆ చదువు ఎంత మాత్రము ఉపయోగపడుతున్నదనే విషయాన్ని విచారించటం లేదు. తల్లిదండ్రులు పడే బాధలను, కష్టాలను పిల్లలు గుర్తించటం లేదు. ఈనాటి చదువు చాలా Cheap అయిపోయింది. ఇలాంటి చదువు మానవుణ్ణి Chief గా ఎట్లా చేయగలదు?

కాబట్టి పిల్లలు, పెద్దలు, తల్లిదండ్రులు, ప్రభుత్వమువారు అందరూ ఏకమై విద్యావిధానములో తగిన మార్పులు తేవాలి. ఈనాడు ఎక్కడ చూసినా పిల్లల యొక్క గోల ఎక్కువగా కనిపిస్తున్నది. అది పిల్లల తప్పు కాదు. పిల్లలు చాలా మంచివారే! కాని వాళ్ళు చదివే గ్రంథములు సరియైనవి కావు. చదివించే గురువులు, తల్లిదండ్రులు మరియు ప్రభుత్వమువారిలో కూడా దోషముంటున్నది. ఇప్పటికైనా తల్లిదండ్రులు కళ్ళు తెరచి పిల్లలకు సరియైన విద్యనందించి వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలి.

*తరచి చదువు చదువ తర్కవాదమెగాని*
*పూర్ణజ్ఞానంబెపుడు పొందలేడు*
*ఇట్టి చదువు చదివి చావంగనేటికి?*
*చావు లేని చదువు చదువవలయు*

ఏమిటా చావులేని చదువు? అదే ఆధ్యాత్మిక చదువు. అయితే, లౌకికవిద్య కూడా అవసరమే! లౌకికమైన చదువులలో ధార్మిక, ఆధ్యాత్మిక, నైతికవిలువలను పెంపొందింపజేయాలి. ఎవరికి తగిన విద్యలు వారు నేర్చుకోవాలి

ప్రాచీనకాలంలో తల్లిదండ్రులు ఎంతటి విజ్ఞానముచేత, ఎంతటి క్రమశిక్షణచేత తమ పిల్లలను పోషించుకుంటూవచ్చారో ఒక్కసారి విచారణ చేయాలి. ఈనాడు అనేకమంది

sri sathyasai vachanamrutam

మగపిల్లలు మాఇష్టం మాది. మమ్మల్ని ఎవరేమి చేయగలరు? అనే అహంకారంతో పెడమార్గం పట్టి చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. "నాయనా! నీవు బజార్లో నడిచే సమయంలో రోడ్డు చూసుకొని నడు. అటూ ఇటూ చూసుకుంటూ నడిస్తే ప్రమాదాలకు గురి కావలసివస్తుంది" అని నేను ఎంతగానో చెబుతుంటాను, కాని కొందరు మోటారు సైకిల్‌పై స్పీడుగా పోతూ అటువైపున, ఇటువైపున వచ్చిపోయే స్త్రీలను చూస్తుంటారు. తత్ఫలితంగా ప్రమాదాలకు గురి అవుతుంటారు. ఈవిధంగా అనేక మంది విద్యార్థులు మోటారు సైకిల్ యాక్సిడెంట్లలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తల్లిదండ్రులు ఎన్నో శ్రమలకోర్చి పిల్లలను పెంచి పెద్దచేస్తారు. అటువంటి పిల్లలు ఈరీతిగా ప్రాణాలు కోల్పోయినప్పుడు తల్లిదండ్రులు ఎంత బాధపడతారో చెప్పటానికి వీలుకాదు.

"మగపిల్లలు మోటారు సైకిళ్ళమీద పోతున్నారు. మేము మాత్రం మోటారు సైకిళ్ళు ఎందుకు నడపకూడదు?" అని ఆడపిల్లలు పిచ్చివాదనతో కాలమును వ్యర్థం చేస్తున్నారు. ఆడపిల్లలు మోటారు సైకిళ్ళమీద పోకూడదని ఎవ్వరూ చెప్పటం లేదు. అయితే సమయ సందర్భానుసారముగా మనం వాటిని ఉపయోగపెట్టుకోవాలి. "మగపిల్లలు నేర్చిన చదువులు మేమెందుకు నేర్చుకోకూడదు? వానితో సమానంగా మాకు కూడా గొప్పపేరు రావాలి" అని ఆశిస్తున్నారు. ఎవరికి తగిన విద్యలు వారు నేర్చుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో సంసారమును చక్కగా పోషించుకుంటూ పిల్లలకు చక్కని నడవడికను నేర్పించాలి. చదువులు చదువకూడదని నేను చెప్పడం లేదు. చదువవలసిన చదువు చదవాలి.

నా మాటలను మీరు వేరుగా భావించకండి. మీ అభివృద్ధికోసం, మీ క్షేమంకోసం, మీ పేరుప్రతిష్ఠలకోసం నేను చెబుతున్నాను. మీరు మీ తల్లిదండ్రులకు సత్కీర్తి తెప్పించే చదువులు చదవాలన్నదే నా ఆకాంక్ష. అంతేగాని, ఈ లౌకికమైన చదువులు చదవకూడదని నేను బోధించడం లేదు. నిజంగా మీరు ఈ చదువులు చదవకూడదంటే నేను ఈ విద్యాసంస్థలను, మహిళా కళాశాలలను ఎందుకు స్థాపిస్తాను? మీకు మంచి నడవడికను నేర్పించాలనే నేను విద్యాసంస్థలను స్థాపిస్తున్నాను. తల్లిదండ్రులకు ఎట్టి ఖర్చూ లేకుండా పిల్లలకు సరియైన విద్యను బోధించి వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దాలనేది నా ఉద్దేశ్యం.

ఈనాటి చదువులు పోటీలకు, పోట్లాటలకు దారి తీస్తున్నాయి. ఇందులో తల్లిదండ్రుల

sri sathyasai vachanamrutam

దోషముకూడా ఉన్నది. "మా బిడ్డ ఎం.ఏ. చదివింది. మీ కుమారుడు ఏమి చదివాడు?" అని ప్రశ్నిస్తుంటారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చదివిన అమ్మాయికి పోస్టుగ్రాడ్యుయేషన్ చదినిన అబ్బాయే చిక్కాలంటే ఎలా చిక్కుతాడు? మా అమ్మాయి చాలా అందంగా ఉంది. మీ కుమారుడు కూడా అందంగా ఉండాలి" అంటారు. ఏమి అందము? గుణసౌందర్యమే ప్రధానమైనది. మంచి గుణములే నిజమైన అందాన్ని పోషిస్తాయి. గుణములు లేకుండా ఎన్ని అలంకారములు చేసుకున్నా అవి హృదయాన్ని ఆకర్షింపజాలవు.

**గుణములే నిజమైన గురువులు**

విద్యార్థులారా! మీ మంచిగుణములే మిమ్మల్ని కాపాడుతాయి. మీ కన్నులను స్వాధీనంలో పెట్టుకోండి. మీ నాలుకను అదుపులో పెట్టుకోండి. ఈ రెండింటినీ స్వాధీనంలో పెట్టుకుంటే ఇతర ఇంద్రియములన్నీ మీకు స్వాధీనమైపోతాయి. బుద్ధుడు ఇంద్రియ నిగ్రహమును సాధించే నిమిత్తమై అనేక సాధనలు చేశాడు. ఇంద్రియాలను ఇష్టమొచ్చినట్లుగా వినియోగిస్తూ ఎన్ని సద్గ్రంథాలను చదివినా వచ్చే ఫలితమేమీ లేదని గుర్తించాడు. మంచిని చూడాలి, మంచిని వినాలి, మంచిని ఆచరణలో పెట్టాలి. మంచిమార్గములో మనం జీవించాలి. దీనికోసమే భగవంతుడు ఇంద్రియాలను ప్రసాదించాడు. బుద్ధుడు ఈ సత్యాన్ని గుర్తించి గ్రంథాలను ప్రక్కకుపెట్టాడు. అంతర్వాణినే తన గురువుగా భావించాడు. తన ఇంద్రియాలను స్వాధీనపరచుకున్నాడు. నిద్రిస్తున్న భార్యను, కుమారుని త్యజించి రాత్రికి రాత్రి అడవికి వెళ్ళాడు. అయితే కట్టుకున్న భార్యను, కన్నకుమారుని వదలిపెట్టమని నేను మీకు చెప్పడం లేదు. వారిని చక్కగా చూసుకుంటూ, వారికి సరియైన గుణములు నేర్పుతూ మీరుకూడా సరియైన గుణములను పోషించుకొని అభివృద్ధికి రావాలి. బుద్ధుడు ఆవిధముగా గొప్పగొప్ప గుణములను సాధించాడు. గుణములకు మించిన గురువులు లేనే లేరు. గుణములే నిజమైన గురువులు. ఈ గురువుల మాటలు నమ్మినప్పుడే మీరు మంచి అభివృద్ధి పొందగలరు. గుణములను చెడగొట్టేవి ఇంద్రియములే! మీరు దృష్టిని స్వాధీనం చేసుకుంటే సృష్టి అంతా మీకు స్వాధీనమైపోతుంది.

*కన్నులనిచ్చినదెందుకొ తెలుసా?*
*అన్నియు చూసేటందులకా?*



sri sathyasai vachanamrutam

*కాదు, కాదు. దేవాదిదేవుడౌ*
*కైలాసవాసుని చూసేటందుకురా!*
*చెవులను యిచ్చినదెందుకొ తెలుసా?*
*ఊరివారి సుద్దులు వినుటకా? కాదు, కాదు.*
*భగవానుని కీర్తనలు వినేటందుకు?*
*పొందుగ పాదములిచ్చినదెందుకు?*
*సందులు గొందులు తిరుగుటకా?*
*కాదు, కాదు, నందివాహనుని*
*మందిరమ్మున తిరుగుటకురా!*

మీ ఇంద్రియాలను సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. ఇతరుల మాటలు నమ్మి పెడమార్గము పట్టకూడదు. మీరు ఏవేవో గ్రంథములను పఠించనక్కర్లేదు. అన్ని గ్రంథములూ మీలోనే ఉన్నాయి. మొట్టమొదట మీ కన్నులను, చెవులను, నాలుకను స్వాధీనము చేసుకోండి. అదే భాగవతము. ఈ భాగవతమువలననే మీరు బాగవుతారు. అప్పుడే మీరు గొప్ప గుణవంతులౌతారు, బలవంతులౌతారు, అందరికీ గురువులౌతారు. "శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు హనుమంతుడు" అన్నారు. మీరుకూడా అట్టి గొప్ప పేరు సంపాదించాలి.

విద్యార్థులారా! మీ తల్లిదండ్రులు మీరు బాగా డబ్బు సంపాదించాలని ఆశిస్తుంటారు. "అమ్మా! మనకు జీతము ప్రధానం కాదు, జీవితము ప్రధానం. జీతము కోసం జీవితాన్ని నాశనం చేసుకోకూడదు" అని మీరు వారికి నచ్చజెప్పాలి. మీరు బంగారంలాంటివారు, చాలా విలువైనవారు. కాని, కొందరు మిమ్మల్ని పెడమార్గం పట్టించటానికి ప్రయత్నిస్తున్నారు. ఇతరుల మాటలను నమ్మి మీరు పెడమార్గం పట్టకండి. మీరు బాగుపడతారు. జగత్తు మిమ్మల్ని కీర్తిస్తుంది. సద్గుణములను పోషించుకోండి. ఈనాడు విద్యావిషయములో నేను చెప్పదల్చుకున్నది ఇదియే! ధనసంపాదనకంటే గుణసంపాదన చాలా ప్రధానమైనది. కాబట్టి గుణములను పెంచుకోండి. బంగారూ! గుణములను పెంచుకునేవారికి, గుణములను బోధించే వారికి నేను ఏమైనా ఇస్తాను. నా ప్రాణమైనా ఇస్తాను. అటువంటివారికోసమే నేను జీవిస్తున్నాను. మీదగ్గరినుండి నేను ఏమీ ఆశించటంలేదు.

sri sathyasai vahanamrutam

పెద్దలను గౌరవించండి. అందరూ నా తల్లులే, తండ్రులే అని భావించండి. మంచివారితో చేరి, మంచిమాటలు నేర్చుకొని, మంచిచూపులను అలవర్చుకొని, మంచివిద్యను నేర్చుకొని మంచివారిగా జీవించండి. మంచిపేరు తెచ్చుకోండి. అదే నేను ఆశించేది. మీ తల్లిదండ్రులు కూడా ఇదే ఆశిస్తుంటారు. కాని, మీ భవిష్యత్తుకి ఏది మంచిదో వారికి తెలియకపోవటంచేత మీకు సరియైన మార్గము చూపించలేకపోతున్నారు. నిజంగా తెలిసిన ఏతండ్రైనా కుమారుణ్ణి పెడమార్గంలో పొమ్మని చెబుతాడా? చెప్పడు. ఏ తల్లీ చెప్పదు. అయితే, తెలిసిన తల్లిదండ్రులు కూడా కుమారుడు ఏమనుకుంటాడో అనే భయంచేత చెప్పటంలేదు. కాని నాకలాంటి భయం లేదు. కనుకనే మీకు ఇవన్నీ బోధిస్తున్నాను. త్యాగము చాలా గొప్పది. భోగము రోగాన్ని తెస్తుంది. త్యాగము యోగాన్ని చేకూర్చుతుంది. "నకర్మణానప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః " అన్నది వేదము. కనుక, త్యాగమును అభివృద్ధి చేసుకోండి బంగారూ! మీకోసం నేను ఎటువంటి త్యాగానికైనా సిద్ధంగానే ఉన్నాను. మీరు కూడా సిద్ధంగా ఉండాలి. అప్పుడు నేను మీవాడను, మీరు నావారు. వేదము "మాతృదేవో భవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవో భవ" అని బోధించింది. తల్లిదండ్రులే నిజమైన గురువులు. కాబట్టి, తల్లిదండ్రుల ఆజ్ఞను శిరసా వహించండి. వారికి ఏమైనా నచ్చజెప్పవలసివస్తే మృదుమధురమైన మాటలతో వారికి అర్థమయ్యేరీతిగా చెప్పండి. ఈనాడు చాలామంది పిల్లలు మంచి జరగాలని ఆశిస్తున్నారు. కాని చెడ్డను అనుసరిస్తున్నారు. చక్కెర కావాలని ఆశిస్తున్నారు, చేదును తింటున్నారు. ఆశించేది ఒకటి, ఆచరించేది మరొకటి.

*మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం*
*మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం*

త్రికరణశుద్ధి గలవారే నాకు బిడ్డలు. అలాంటివారికి నేను ఏది కావలసినా ఇస్తాను. దేనికీ కాదని చెప్పను. విద్యార్థులారా! గతంలో తెలియక ఎన్నో పొరపాట్లు జరిగియుండవచ్చు. ఇక, ముప్ముందైనా సరియైన గుణములను పోషించుకొని, ఒకవైపున తల్లిదండ్రులను, మరొకవైపున స్వామిని సంతోషపెట్టటానికి ప్రయత్నించండి.

(2004 జనవరి 15వ తేదీ ఉదయం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

srisathyasaivahini.org